

# రహస్యాలను వెల్లడించి మృత్యువు పాలైన సర్పాల కథ

డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

**పూర్వం ఒక నగరంలో దేవశక్తి అనే రాజు వుండేవాడు. అతనికి ఒక కుమారుడుండేవాడు. అతడి పొట్టలో ఒక పాముండేది. దాని వల్ల అతడు రోగగ్రస్తుడై రోజురోజుకూ కృశించిపోసాగాడు. ఎందరో వైద్యులు ఎన్నో విధాలుగా చికిత్సలు చేసినా అతనికి స్వస్థత చేకూరలేదు. అప్పుడా రాజకుమారుడు నిర్వేదంతో దేశాటన చేస్తూ పొరుగు దేశానికి చేరుకున్నాడు.**

అక్కడ ఒక నగరం లోనికి ప్రవేశించి, భిక్షాటన చేస్తూ, పెద్ద దేవాలయంలో బస చేస్తూ కాలం గడుపుతుండేవాడు.

ఆ నగరాన్ని బలి అనే రాజు పాలిస్తుండేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలుండేవారు. వారిద్దరూ యౌవనవతులు. రోజూ సూర్యోదయసమయంలో తండ్రి దగ్గరికి వచ్చి పాదాభివందనం చేసేవారు. అలాగే ఒకనాడు వారిలో ఒకతె తండ్రికి నమస్కరిస్తూ, "మహారాజా! మీకు విజయం కలుగుగాక! మీ అనుగ్రహం వల్లనే అందరికీ సౌఖ్యం కలుగుతూంది" అన్నది.

అంతలో రెండవ కుమార్తె, "మహారాజా! మీకు తగినవే అనుభవించండి!" అన్నది.

రెండవ కుమార్తె మాటలు విని మండిపడ్డ ఆ మహారాజు, "ఓ మంత్రులారా! దుర్భాషలాడిన ఈ నా కుమార్తెను ఒక విదేశీయునికి అప్పగించండి" అని ఆదేశించాడు.

వారు అలాగే ఆమెను తీసుకొనిపోయి, ఒక దేవాలయంలోని ఆ రాకుమారునికి అప్పగించారు. అప్పుడామె అతన్ని వివాహం చేసుకొని, భర్తను భగవంతుడుగా భావించి సంతోషంతో సపర్యలు చేస్తూ, కొన్నాళ్లకు మరో దేశానికి తీసుకొనిపోయింది. ఆ నగరంలోని ఒక చెరువు గట్టు మీద అతన్ని వుండమని చెప్పి, తాను నగరం లోపలికి వెళ్లి, బియ్యం, నూనె, పప్పులు, నెయ్యి మొదలైన సరకులను కొనుక్కొని రావటానికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి అతడు ఒక పాముల పుట్ట మీద తల పెట్టి నిద్ర పోతున్నాడు. అతని కడుపులో వున్న సర్పం నోటిలో నుంచి బయటికి వచ్చి, అలా అతని నోటిలో వుండే గాలిని పీల్చుకొంటూ వుంది. ఇంతలో పుట్టలో నుంచి బయటికి వచ్చిన మరో సర్పం కూడా గాలిని పీల్చుకొంటూ వుంది. ఈ దృశ్యం చూసిన రాజకుమార్తె దిగ్భ్రాంత అయింది. వాటి కంట పడకుండా పక్కనున్న చెట్టు చాటున దాక్కుంది.



పుట్ట మీదున్న సర్పం, "ఒరే దురాత్ముడా! ఇంత సుందరుడైన రాకుమారుణ్ని బాధ పెడుతున్నావెందుకు?" అని అడిగింది.

అప్పుడు రాకుమారుని నోటిలో నుంచి బయటికి వచ్చిన సర్పం, "ఒరే! నీవు కూడా నీ పుట్టలో రెండు స్వర్ణకలశాలను వుంచుకోలేదా?" అని అడిగింది.

అప్పుడు పుట్ట మీది పాము, "ఒరే, దురాత్ముడా! ఎండి పోయిన జీవంతీలతలను తింటే నీవు చస్తావని ఎవరికీ తెలియదు. నాకే తెలుసు" అని పలికింది.

ఇంతలో అక్కడున్న మూడో సర్పం, "ఒరే! నీవు కూడా కాగుతున్న నూనెతో కానీ, నీళ్లతో కానీ మరణిస్తావని నాకు మాత్రమే తెలుసు" అని చెప్పింది.

ఈ మాటలను విన్న రాజకుమార్తె, అవి మాట్లాడినవన్నీ గుర్తు పెట్టుకొని, ఆ విధంగానే చేసి వాటిని చంపేసింది. దానితో రాజకుమారుడు ఆరోగ్యవంతుడు కాగా, ఆమె భర్తతో సహా తన తండ్రి రాజ్యానికి ప్రయాణం కట్టింది. తల్లిదండ్రులూ, బంధువులూ ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకొన్నారు. తరువాత ఆమె భర్తతో సుఖంగా జీవితం గడిపింది.

**(వచ్చేవారం: మూషికం కథ)**